క్లుప్తంగా

చెత్త తరలింపులో అప్రమత్తంగా ఉండాలి

తిరువూరు: పట్టణంలోని వివిధ వార్డుల్లో సేకరిస్తున్న చెత్త, ఇతర వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని నగరపంచాయతీ ఇన్‌చార్జి కమిషనర్ డి. బాలకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన డంపింగ్ యార్డులో రీసైక్లింగ్ యూనిట్‌ను పరిశీలించారు. స్వచ్ఛభారత్ నిబంధనల మేరకు తడి, పొడి చెత్తను వేరుచేసి డంపింగ్‌యార్డుకు తరలించాలని వార్డు శానిటేషన్ కార్యదర్శులకు ఆదేశాలిచ్చారు.

పాడి రైతుల సంక్షేమమే లక్ష్యం



రెడ్డిగూడెం: మండలంలోని ముచ్చనపల్లి, శ్రీరామపురం పరిధిలోని సొసైటీలను కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు గురువారం సందర్శించారు. పాడి రైతుల సంక్షేమమే మన మతం–అలుపెరగని సేవ మన అభిమతం అనే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పాల రైతులకు అనేక పథకాల ద్వారా చేయూతనిస్తున్నామన్నారు. అనంతరం ఆయనను పాడి రైతులు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పాలకవర్గ సభ్యులు బోయపాటి సుశీల, జిల్లా ట్రస్ట్ సభ్యులు పల్నాటి సత్యనారాయణ, ఎం. విజయలక్ష్మి, మేనేజర్ టి. సాంబమూర్తి, శ్రీరామపురం, కోడూరు, రేపూడి సంఘ అధ్యక్షులు సభ్యుడు, వేతన కార్యదర్శి, సూపర్‌వైజర్, పాడి రైతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలను పాటించాలి



నూజివీడు: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని నూజివీడు మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.నాగమురళి అన్నారు. స్థానిక రవాణా యూనిట్ కార్యాలయంలో 34వ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్కూల్, కళాశాలల వ్యాన్ డ్రైవర్లకు గురువారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అతివేగం మంచిది కాదని, మద్యం సేవించి వాహనాన్ని నడపకూడదని సూచించారు. కచ్చితంగా రోడ్డు భద్రత నియమాలను పాటిస్తే 90 శాతం ప్రమాదాలను నివారించొచ్చని అన్నారు. మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ 2 కె.ప్రసాద్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేటప్పుడు సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ–2 జి.వెంకటేష్, ఇన్స్యూరెన్స్ కంపెనీ ప్రతినిధి నందూరి స్ఫూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో ఆర్థిక భరోసా



ఆగిరిపల్లి: ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో మహిళలకు ఆర్థిక భరోసా కలుగుతుందని ఏలూరు జిల్లా సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ కె.సరళ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సీడ్ క్యాపిటల్ ద్వారా రుణాలు పొందిన లబ్ధిదారులకు గురువారం ఒకరోజు శిక్షణ ఇచ్చారు. సెర్ప్ డైరెక్టర్ మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక అంశాలపై అవగాహన పెంచుకొని వ్యాపార ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో 9,500 మందికి సీడ్ కాపిటల్‌ను వినియోగించుకున్నట్టు చెప్పారు. ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమ క్రమబద్ధీకరణ పథకం కింద చిన్నతరహా పరిశ్రమలకు రూ.1 లక్ష నుంచి రూ.10 లక్షల వరకు షూరిటీ లేకుండా 35 శాతం సబ్సిడీపై రుణాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం విజయకుమారి, ఏపీఎం రామకృష్ణ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయండి

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండలం ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల ఇన్‌చార్జి మల్లాది రామారావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ నాయకులు ఇంకొల్లు జమలయ్య, మందూరి నాగేశ్వరరావు, మంతెన శ్రీను పాల్గొని మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన ఎంఎస్‌పీ రాష్ట్రస్థాయి సదస్సు నూతన అధ్యక్షుడు వైకే విశ్వనాథం అధ్యక్షతన జరుగుతోందన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా జాతీయ అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ పాల్గొంటారన్నారు. మైలవరం నియోజకవర్గ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సమ ప్రాధాన్యం

ఎమ్మెల్యే రక్షణనిధి


తిరువూరు మండలం రాజుగూడెంలో ప్రభుత్వ పథకాల బ్రోచర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

వావిలాల(తిరువూరు): పేదలకు సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకూ ప్రాధాన్యం ఇస్తున్నట్లు తిరువూరు శాసనసభ్యులు కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. గురువారం మండలంలోని వావిలాల శివారు రాజుగూడెంలో రెండోరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలను కలిసి వారికి ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధుల వివరాలతో కూడిన బ్రోచర్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. విద్యార్థుల ఉన్నత చదువులకు జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన పథకాలతో పాటు ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు అమ్మ ఒడి పథకం ద్వారా ప్రభుత్వమే చదువుకు అయ్యే ఖర్చులను భరిస్తోందని ఎమ్మెల్యే వివరించారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య నందించేందుకు కృషి జరుగుతోందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో రహదారులు అభివృద్ధి చేయడంతో పాటు గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలు త్వరితగతిన లభ్యమయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుభరోసా, ఆరోగ్యశ్రీ తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, రాజుగూడెం పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొమ్మినేని కిశోర్, మాజీ సర్పంచి రాజవరపు కృష్ణయ్య, స్థానిక నాయకులు గోపాలరావు, గొర్రాజు పాల్గొన్నారు.

నేడు తెల్లదేవరపల్లిలో..

విస్సన్నపేట: మండలంలోని తెల్లదేవరపల్లి సచివాలయం పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తారన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

క్రీడలపైనా దృష్టి సారించాలి


బాస్కెట్‌బాల్ క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

నూజివీడు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా దృష్టి సారించాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఇటీవల అనకాపల్లిలో నిర్వహించిన అండర్–19 ఎస్‌జీఎఫ్ బాలుర, బాలికల రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పట్టణంలోని విక్టోరియా గ్రౌండ్‌కు చెందిన క్రీడాకారులు ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరందరిని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు గురువారం అభినందించారు. క్రీడల్లో రాణించడం ద్వారా జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని ఎమ్మెల్యే అన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రీడల వైపు దృష్టి సారించేలా ప్రోత్సహించాలని సూచించారు. నూజివీడు ప్రాంతంలో గత 70 ఏళ్లుగా బాస్కెట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, షటిల్, వాలీబాల్ తదితర క్రీడల్లో రాణించిన క్రీడాకారులు ఎందరో ఉన్నారని గుర్తుచేశారు. వారంతా జీవితంలో మంచి స్థానంలో స్థిరపడ్డారని తెలిపారు. క్రీడల వల్ల పేరు ప్రతిష్టలు రావడంతో పాటు శారీరక దారుఢ్యం పెరగడంతో పాటు ఆరోగ్యం మెరుగవుతుందని వివరించారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ కోచ్, పీడీ వాకా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులు వేగవంతం చేయాలి

తోటమూల(గంపలగూడెం): నాడు–నేడు పథకంలో రెండో విడత ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేపట్టాలని ఎంపీడీఓ వై. పిచ్చిరెడ్డి తెలిపారు. తోటమూల కేజీబీవీలో గురువారం నాడు–నేడు పథకంపై సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ సహాయకులతో వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం జరిపారు. ఆయా పాఠశాలల్లో మరుగుదొడ్లు, వంటగది, అదనపు తరగతి గదులు, పాఠశాలల చుట్టూ ప్రహరీలకు ఈ విడత ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ఆయా పనులను చేపట్టే విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఎంఈఓ సోమశేఖర్ నాయక్, కేజీబీవీ ప్రత్యేక అధికారి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షిప్తం

● నేటి నుంచి నాటిక పోటీలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సుంకర–టి.కృష్ణ మెమోరియల్ నాగార్జున కళాపరిషత్ 15వ నాటిక పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభం అవుతున్నాయని ఆ సంస్థ అధ్యక్షుడు దేవినేని కిశోర్‌కుమార్ గురువారం తెలిపారు. ప్రముఖ సినీనటులు జీవా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. 20న మల్లాది క్రియేషన్స్ హైదరాబాద్ వారిచే అమెరికా అల్లుడు నాటిక, చిలకలూరిపేట వారి ఆలీతో సరదాగా నాటిక, 21న హైదరాబాద్ కళాంజలి వారిచే మనిషి మంచోడే నాటిక, విజయవాడ యంగ్ థియేటర్స్ వారి అనుకున్నది ఒకటి అయ్యింది ఒకటి నాటిక, 22న ఒంగోలు పండు క్రియేషన్ వారి పక్కింటి మొగుడు నాటిక ప్రదర్శిస్తారన్నారు.

● వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

ఆంజనేయపురం(తిరువూరు): మండలంలోని ఆంజనేయపురానికి చెందిన జజ్జర రమేష్(35) మూడు రోజులుగా కనిపించడం లేదని అతని భార్య యశోద గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందాలకు వెళ్లిన రమేష్ ఇంతవరకు ఇంటికి తిరిగి రాలేదని, అతని ఆచూకీ బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా ఫలితం లేదని యశోద పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

● కంటి వైద్య శిబిరం

రెడ్డిగూడెం: అభ్యుదయ యువశక్తి సంఘం నందు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ శిబిరం నందు 45 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు చింతిరాల ఫ్లారెన్స్, పల్లెం లక్ష్మీ కుమారి పాల్గొని రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షులు చింతిరాల వెంకటేశ్వరరావు, సెక్రటరీ చింతిరాల సావిత్రి, కోశాధికారి తాలూరి ఝాన్సీ, సభ్యులు పాల్గొన్నారు.

● ఉన్నత విలువలతో కూడిన విద్య అవసరం

మైలవరం: విద్యార్థులు కొత్త ఆలోచనలు, కొత్త లక్ష్యాలు ఏర్పరచుకొని, ఉన్నత విలువలతో విద్యను అభ్యసించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్స్ సంయుక్త నిర్వహణలో విద్యార్థులకు నాయకత్వంపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. విద్యార్థులు అచేతనంగా ఉండకూడదని, విలువలు, కోరికలు, లక్ష్యాలు మానవుని సంపూర్ణ వ్యక్తిగా మారుస్తాయని, ఏ కోరికలు మంచివి అనే విషయం కూడా గ్రహించాలని ప్రిన్సిపాల్ తెలిపారు. మనం చేసే ఆలోచనే మన స్థాయిని నిర్ణయిస్తుందన్నారు. రిసోర్స్‌పర్సన్‌గా ఆగస్టి రమ్య పాల్గొని ప్రసంగించారు. తెలుగు విభాగం శాఖాధ్యక్షుడు డాక్టర్ మెండా దేవానందకుమార్, ఇంగ్లిష్ విభాగాధిపతి బి. సుభాషిణి పాల్గొన్నారు.

● వలంటీర్ల దాతృత్వం అభినందనీయం

ముసునూరు: గ్రామ వలంటీర్లు దాతృత్వాన్ని చాటుకోవడం అభినందనీయమని జెడ్పీటీసీ పరికూటి ప్రతాప్ పేర్కొన్నారు. ముసునూరు మండలం చెక్కపల్లికి చెందిన చెన్నూరి రమేష్ (31) గుండెపోటుతో ఇటీవల మృతిచెందాడు. దీంతో గ్రామ వలంటీర్లు నున్న వెంకన్న, తిరుపతిరావు, నాగేంద్ర ఆధ్వర్యంలో 10 మంది కలిసి రూ.3,000, వార్డు సభ్యురాలు పేరిచర్ల రమణ రూ.2,000 రమేష్ కుటుంబానికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లను జెడ్పీటీసీ, గ్రామ ఉపసర్పంచ్ చిలుకూరి పద్మజా దేవేంద్ర, పార్టీ నేతలు తల్లిబోయిన వెంకటేశ్వరరావు, సీహెచ్ నత్యం తదితరులు అభినందించారు.

● పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

తిరువూరు: తిరువూరు వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా దోసపాటి రవికుమార్ గురువారం ప్రమాణం చేశారు. ఆర్యవైశ్యకల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో నూతన కార్యవర్గంతో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీ అవంతుల శ్రీనివాసరావు ప్రమాణం చేయించారు. వాసవీ వనిత అధ్యక్షురాలిగా చిత్తలూరి అనూరాధ, వాసవీ క్లబ్ సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడిగా నాళ్ల సూర్యప్రకాశరావు, వాసవీ తిరువూరు కపుల్స్ క్లబ్ అధ్యక్షుడిగా దారా శ్రీనివాసరావు, యువసేన అధ్యక్షుడిగా నాళ్ల సుధాకర్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు శారద, కంచర్ల శశికళ, నాళ్ళా వెంకట రామారావు, సోమవరపు సత్యనారాయణ, గుబ్బా రాజేశ్వరి, కొత్తగుండ్ల ప్రసాదరావు, పవన్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేద ఇంజినీరింగ్ విద్యార్థులకు దాతల వితరణతో ల్యాప్‌టాప్స్ పంపిణీ చేశారు.

● బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

వినగడప(గంపలగూడెం): వినగడప సచివాలయాన్ని ఎంపీడీఓ వై. పిచ్చిరెడ్డి గురువారం తనిఖీ చేశారు. సిబ్బంది బయోమెట్రిక్ హాజరు ఈ–సేవ సర్వీసులు, మూమెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల క్యాలెండర్లు పరిశీలించారు. సకాలంలో బయోమెట్రిక్ హాజరును వేయాలని, రిజిస్టర్లు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పలు సమస్యలపై సచివాలయాలకి వచ్చే గ్రామస్తులకు సరైన సమాధానం ఇవ్వడంతో పాటు పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పలువురు సచివాలయ సిబ్బంది ఆ సమయంలో అందుబాటులో లేకపోవడం పట్ల ఎంపీడీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీహెచ్‌ఈఓ ఎస్. హైమావతి, ఇంజినీరింగ్ సహాయకులు పద్మజ పాల్గొన్నారు.

● డీపీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

గంపలగూడెం: డీపీఆర్టీయూ గంపలగూడెం మండలశాఖ రూపొందించిన క్యాలెండర్, అప్లికేషన్ బుక్లెట్లను స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ శాఖ జిల్లా అధ్యక్షులు బి. జమలయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఉపయుక్తంగా వీటిని రూపొందించామన్నారు. అనంతరం పాఠశాలలోని సభ్యులకు, ఊటుకూరు హైస్కూల్లో సభ్యులకు వాటిని పంపిణీ చేశారు.

● పాలడుగుకు ఘన నివాళి

ముసునూరు: జమీందారీ వ్యవస్థను ఎదురొడ్డి, పేదల కోసం భూ పోరాటాలు చేసిన నీతివంతమైన రాజకీయ నేత పాలడుగు వెంకటరావు ధైర్య సాహసాలు ఆదర్శనీయమని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత వలసపల్లి రామచంద్ర ప్రసాద్ (రాముడు) అన్నారు. మాజీ మంత్రి, నూజివీడు ప్రజల మనిషి పాలడుగు వెంకటరావు 8వ వర్ధంతి సందర్భంగా గురువారం ముసునూరు మండలం గుళ్లపూడిలోని పాలడుగు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆర్.శ్రీదేవి శ్రీనివాస్, ఉపసర్పంచ్ వేంపాటి వల్లీ పద్మజ రాంబాబు, మాజీ సర్పంచ్ ఊరకరణం వల్లీ శాంతకుమారి, సీనియర్ నేతలు కూరపాటి శోభనాద్రి, మండల కళాకారుల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు కూసం మార్కండేయులు, బొల్లిన నాగరాజు పాల్గొన్నారు.

● పాలడుగు వెంకట్రావు వర్ధంతి

నూజివీడు: మాజీ మంత్రి పాలడుగు వెంకట్రావు 8వ వర్ధంతిని గురువారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బీడీ రవికుమార్ పాలడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సుంకర సుభాష్‌చంద్రబోస్, టీఆర్‌బీ విశల్‌కుమార్, పరిమి సాగర్‌కుమార్, పల్లెపాము ప్రసాద్, లావు ప్రసాద్, పాతూరి రవి,ఆకుల నాని, గోపే మురళి, పావులూరి రమేష్, బీజేపీ నాయకులు నూతక్కి వేణు తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబవుతున్న కల్యాణ మండపం

ఆగిరిపల్లి: ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహ స్వామివార్ల రథసప్తమి ఉత్సవాలకు కల్యాణ మండపాన్ని (పెద్ద కొఠాయి)ని ముస్తాబు చేస్తున్నారు. గత రెండు రోజులుగా దేవదాయశాఖ ఆధ్వర్యంలో రంగులు వేయిస్తున్నారు. ఈ నెల 22 నుంచి కల్యాణ మండపంలో ఆయా సామాజిక వర్గాల ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు.

● వైఎస్సార్ సీపీ నేత సత్యంబాబు మృతి

ఆగిరిపల్లి: మండలంలోని నరసింగపాలెంకు చెందిన వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు సూరానేని పెద్ద సత్యంబాబు (67) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. దీంతో పార్టీ నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. సత్యంబాబుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరికి గ్రామ సర్పంచి మొగదాటి అనూష పురుషోత్తం సానుభూతిని తెలియజేశారు.

● నేడు గొల్లగూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

ఆగిరిపల్లి: మండలంలోని నెక్కలం గొల్లగూడెంలో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. కార్యక్రమానికి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు హాజరై నవరత్నాల పథకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందించిన లబ్ధి బుక్‌లెట్‌లు ప్రజలకు అందిస్తారని, వారి సమస్యలను తెలుసుకుంటారని తెలిపింది.

● ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలి

చాట్రాయి: ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపాలని ఆ శాఖ జిల్లా కో ఆర్డినేటర్ హిస్సిన్ అన్నారు. గురువారం మండలంలోని జనార్దనవరం గ్రామంలో జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువులతో పండించిన పంటలు ఆరోగ్యానికి మేలని, వ్యవసాయ ఖర్చులు చాలా తగ్గుతాయని హిస్సిన్ చెప్పారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎం .చంటిబాబు, శ్రీనివాసరావు, ప్రసాదు, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

● బాలికలు వృత్తి విద్యా కోర్సులు నేర్చుకోవాలి..

ఎ.కొండూరు: బాలికలు చదువుతో పాటు వృత్తి విద్యా కోర్సులు నేర్చుకోవాలని సీడీపీఓ జి. సత్యవతి అన్నారు. మండలంలోని కంభంపాడు గ్రామంలో అంగన్‌వాడీ కేందరం వద్ద గురువారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలికలకు వృత్తి విద్యా కోర్సులపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ గ్రామాల్లో చదువు పూర్తి చేసిన మహిళలు టైలరింగ్, ఎంబ్రాయిడింగ్ కోర్సులు నేర్చుకుంటే ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. చదువుకుంటున్న విద్యార్థులు చదువుతో పాటు కంప్యూటర్ నేర్చుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు టి. శివకుమారి, జి. ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.

● హైస్కూల్‌కి క్రీడా సామగ్రి వితరణ

చాట్రాయి: క్రీడలను ప్రోత్సహించేందుకు దాతల అందించే సహాయ సహకారాలు అభినందనీయమని చాట్రాయి మండలం చనుబండ హైస్కూల్ హెచ్‌ఎం ఎం. సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక హైస్కూల్లో పూర్వపు విద్యార్థి చెరుకు శ్రీనివాసరావు హైస్కూల్‌కి క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో దాత తండ్రి చెరుకు శ్రీమన్నారాయణ, రిటైర్డ్ పీఈటీ పిరంగి పుల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి


మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శిరీష

నూజివీడు: ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుల సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తున్నట్లు ఎంపీపీ ఆరేపల్లి శిరీష అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటుచేసిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి శిరీష అధ్యక్షత వహించి మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో ఉన్న అంతర్గత రహదారులను సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు మాట్లాడుతూ స్థానిక సంస్థల సహకారంతో గ్రామాలను మరింత అభివృద్ధి పథంలో పయనించేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పలు శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఏఓ ఆలూరు చాముండేశ్వరి మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 4,300 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేశామన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు 21 రోజుల్లో ప్రభుత్వం ధాన్యం డబ్బులను వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తోందని చెప్పారు. పీఎం కిసాన్ యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం అందించే రూ.2 వేలు పొందడానికి జాబితాలోని రైతులందరూ ఈ నెలాఖరు నాటికి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రబీ సీజన్‌లో మండలంలో రైతులు మొక్కజొన్న పంటను 3500 ఎకరాల్లో సాగు చేశారని చెప్పారు. ఎంఈఓ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకం, జగనన్న విద్యాకానుక, అమ్మఒడి పథకాల ద్వారా విద్యార్థులకు అందిస్తోన్న వివరించారు. ఐసీడీఎస్, వైద్యం, ఇరిగేషన్, ఎన్నెస్పీ, పంచాయతీరాజ్, ఉద్యానశాఖ, హౌసింగ్ తదితర శాఖలపై సమీక్ష చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ దండుబోయిన స్వర్ణలత, ఎంపీడీఓ ఎంపీఎస్ సుందరి తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో నుంచి రైల్వే లైన్ వద్దు


వినతి పత్రం అందజేస్తున్న బాధిత రైతులు

మైలవరం: మైలవరం మీదుగా కొత్తగా రైల్వే లైన్ వేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకునే చర్యలను తక్షణం నిలుపుదల చేయాలని స్థానిక రైతులు కోరారు. ఈ రైల్వే లైన్ వల్ల స్థానికంగా ఉండే నిరుపేద రైతులు అనేక మంది తమ సాగు భూములను కోల్పోతారని బాధిత రైతులు గోగులమూడి సాంబశివారెడ్డి, కె. సుందరరావు, పి. రాంబాబురెడ్డి వివరించారు. ఈ మేరకు మైలవరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్ సమక్షంలో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ప్రతినిధి అల్లాబక్ష్ కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మైలవరం, చంద్రగూడెం గ్రామాల మీదుగా కొత్తగా వేయనున్న రైల్వే లైన్ ప్రారంభిస్తే తాము జీవనోపాధి కోల్పోవడమే గాక తమకు చెందిన పశువులు, మూగజీవాలు కూడా మేతకు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. పేద రైతులమైన తాము ఏడాదికి రెండు పంటలు పండించుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని, గతంలో చంద్రగూడెంలో జరిగిన గ్రామ సభలో కూడా రైల్వే అధికారులకు ఇవే విషయాన్ని తెలియజేసి, రైల్వే లైన్ ఏర్పాటును అంగీకరించలేదని చెప్పినట్లు వారు చెప్పారు.

కిడ్నీ బాధితులకు అండగా ఉంటాం

తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి


వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఎ.కొండూరు: కిడ్నీ వ్యాధిగ్రస్తులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని స్థానిక ఎమ్మెల్యే కె. రక్షణనిధి అన్నారు. ఎ.కొండూరు తండాలో సరఫరా చేస్తున్న కృష్ణాజలాలను పరిశీలించి, కొత్త నిర్మించిన వాటర్ ట్యాంకులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రక్త పరీక్షలు చేయిస్తున్నామని, అవసరమైన వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులు అందుబాటులో ఉన్నాయని, గ్రామ సచివాలయాల పరిధిలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మందులు పంపిణీ చేయిస్తున్నామన్నారు. కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో రూ. 6కోట్లతో వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసి కృష్ణా జలాలు నింపి తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. ఎ.కొండూరులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయటానికి పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రూ. 35కోట్లతో కృష్ణాజలాలు పైపుల ద్వారా మండలంలోని అన్ని గ్రామాల్లో కుళాయిల ద్వారా తాగునీరు అందించటానికి ప్రతిపాదనలు పంపామని, త్వరలో పనులు కూడా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకులను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రతి రోజు శుభ్రం చేయించి తాగునీరు సరఫరా చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మి, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్య గనియా, సర్పంచ్ భూక్య సావిత్రి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల క్యాలెండర్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం: ఏపీ వైఎస్సార్ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఫైబర్ సంస్థ చైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారానికి యూనియన్ అధ్యక్షుడు జానీషరీఫ్ చేస్తున్న కృషిని అభినందించారు. కార్మికుల హక్కుల పోరాటానికి అండగా ఉంటున్న గౌతమ్‌రెడ్డికి జానీషరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యదర్శి చిన్నబుజ్జి, కోశాధికారి దుర్గారావు పాల్గొన్నారు.

ఘనంగా యోగి వేమన జయంతి



గంగినేని జెడ్పీ హైస్కూల్లో యోగి వేమన చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

జి.కొండూరు: ప్రజా కవిగా, మానవతావాదిగా పేరొందిన యోగి వేమన జయంతిని, జి.కొండూరు మండల పరిధి గంగినేని జెడ్పీ హైస్కూల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం జీవీ రామకృష్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యోగి వేమన తన సాహిత్యంతో ప్రజలను చైతన్య పరిచిన విధానాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులకు వివరించారు.

ఎంపీయూపీ స్కూల్‌లో..

కొండపర్వ (విస్సన్నపేట): మండలంలోని కొండర్వ ఎంపీయూపీ పాఠశాలలో యోగివేమన జయంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వేమన శతకాలు గురించి హెచ్‌ఎం జయరామ్ విద్యార్థులకు వివరించారు.

తిరువూరు: యోగి వేమన జయంతి కార్యక్రమం గురువారం తిరువూరు శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. సమాజ శ్రేయస్సు కోసం వేమన రాసిన నీతి పద్యాలలోని విశిష్టతను గ్రంథాలయాధికారి పద్మావతి వివరించారు. వేమన పద్యాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

వేమన శతక పద్యాలతో చైతన్యం

నూజివీడు: వేమన శతకం పద్యాలు సమాజంలో నిరంతరం చోటు చేసుకునే మంచి చెడుల గురించి ప్రజలను చైతన్యవంతులను చేస్తాయని గొల్లపల్లి హైస్కూల్ హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి అన్నారు. యోగి వేమన జయంతిని గురువారం స్థానిక హైస్కూల్‌లో నిర్వహించారు. వేమన రాసిన పద్యాలు, ఆయన గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో వేమన శతకంలోని పద్యాలను చెప్పించారు.

పవర్ లిఫ్టింగ్‌లో నిమ్రా విద్యార్థినులు ప్రతిభ



జూపూడి(ఇబ్రహీంపట్నం): డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ అంతర్ కళాశాలల స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో నిర్వహించిన సెలక్షన్స్‌లో జూపూడి నిమ్రా మెడికల్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారని కళాశాల డీన్ డాక్టర్ ఫారూఖీ గురువారం తెలిపారు. షేక్ ఆసియా 63కిలోల విభాగం, ఆర్.వందన 57కేజీల విభాగంలో అంతర్ యూనివర్సిటీ స్థాయికి అర్హత సాధించారన్నారు. విద్యార్థినులను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, వ్యాయామ అధ్యాపకులు ఎంఎస్.ఖాన్ బాలికలను అభినందించారు.